క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ రూరల్: అరకులోయ స్టేషన్ పరిధిలోని చినలబుడు, పెదలబుడు, మాడగడ, సుంకరమెట్ట, చొంపి, బొండం, బస్కీ గన్నెల, పద్మాపురం, అరకు సంతబయలు ప్రాంతాల్లోని విద్యుత్ ఫీడర్, లైన్‌లలో మరమ్మతు పనుల నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామసభల నిర్వహణకు అధికారుల నియామకం

కొయ్యూరు: మండలంలోని 33 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు ఈనెల 23 నుంచి జరగనున్న గ్రామసభలకు సంబంధించి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులను నియమించారు. ఇందులో భాగంగా ఎంఈవో రాంబాబును అంతాడకు, సీడీపీవో విజయ కుమారిని అడాకులకు, వెలుగు ఏపీఎం గాంధీ ప్రసాద్‌ను బాలారం, బకులూరుకు, ఏవో ఉమాదేవిని, ఇతర అధికారులను వివిధ పంచాయతీలకు నియమించారు. గ్రామసభల్లో తీర్మానాలు, ఉపాధి పనుల గుర్తింపు తదితర అంశాలపై అంచనా నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తారు.

అరకులోయ సీఐగా హిమగిరి



అరకులోయ రూరల్: అరకులోయ సీఐగా ఎల్. హిమగిరి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా పాడేరులో పనిచేసిన ఆయన ఇటీవల ప్రభుత్వ బదిలీపై అరకులోయ సీఐగా వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాలు ప్రధాన పర్యాటక కేంద్రాలు కావడంతో ప్రజలకు పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తాన్నారు. ప్రధానంగా గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పదవీ భాధ్యతలు స్వీకరించిన సీఐ హిమగిరిని అరకులోయ, అనంతగిరి ఎస్ఐలు సంతోష్, రాము కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ప్రజావేదిక



వై.రామవరం: ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 నుంచి ప్రారంభమవుతుందని, మండలంలోని ఉపాధి సిబ్బంది, కూలీలు, సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రెండో విడత ప్రవేశాలు ప్రారంభం


ప్రిన్సిపాల్ భరత్‌కుమార్

అరకులోయ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశాలకు కోసం విద్యార్థులు ఈ నెల 22 నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలను కళాశాలలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఆత్మీయ సన్మానం


ఎంపీడీవో వీరసాయిబాబును సన్మానిస్తున్న సిబ్బంది

చింతపల్లి: బదిలీపై వెళ్తున్న చింతపల్లి ఎంపీడీవో వీర సాయిబాబును సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీవోగా ఆయన సాధారణ ఎన్నికల సమయంలో ఇక్కడికి బదిలీ అయ్యారు. అనంతరం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన రావులపాలెం బదిలీపై వెళ్తున్నారు. ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు రాజేష్, పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, ఇతర కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పెదబయలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రంగారావు తదితరులు


తోటకూరపాలెంలోని కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

- విద్యాలయాల్లో అధికారుల సందర్శన
- రికార్డుల తనిఖీలు
- మధ్యాహ్న భోజనం పరిశీలన
- హెచ్ఎంలకు సూచనలు


కొయ్యూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తిరుమలరావు


పి.యర్రగొండలోని హస్టల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ అనసూయ

పెదబయలు: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార గండేరు రంగారావు, ఏటీడబ్ల్యూవో కె.స్వర్ణలత అన్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని ఆశ్రమంలో విషాహారం తిని ముగ్గురు గిరిజన విద్యార్థులు మృతి ఘటనపై జిల్లా కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వసతి గృహాల తనిఖీ జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం పెదబయలు ఏపీ గురుకుల రెసిడెన్సియల్ పాఠశాల, పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల వసతి గృహాలను మండల అధికారులతో కూడిన బృందం తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో తహసిల్దార్ రంగారావు మాట్లాడుతూ పాఠశాల, వసతి గృహాల్లోని మరుగుదొడ్లు, పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం, నాలుగు రోజుల కంటే అనారోగ్యంతో ఉన్న విద్యార్థుల వివరాలు సేకరించామని, రోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచనలు ఇచ్చామన్నారు. విద్యార్థుల కాచి చల్లార్చిన గోరు వెచ్చని నీరు అందించాలన్నారు. అలాగే వసతి గృహం స్టాక్ రూమ్‌లో కాలం చెల్లిన వస్తువులు ఉంటే వాడవద్దని ఆదేశించారు. మండలంలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో తనిఖీ జరుగుతుందని, విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బయట నుంచి వచ్చే ఆహారం నిషేధించాలని ఆదేశించారు. తనిఖీల నివేదికను రోజూ కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈవో జి.డేవిడ్ పుష్ప, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కొయ్యూరు: విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని తహశీల్దార్ తిరుమలరావు సూచించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన బుధవారం రాజేంద్రపాలెం బాలికల పాఠశాల, కేజీబీవీ, బాలుర ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనంలో తాజా ఆహార పదార్థాలను వినియోగించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు ఎవరికైనా అనారోగ్యం వస్తే ఆస్పత్రికి తరలించి అధికారులకు తక్షణమే సమాచారం అందజేయాలన్నారు.

వై.రామవరం: మండలంలోని పలు పాఠశాలల్లో ఎంపీడీవో బాపన్నదొర, తహసీల్దార్ అనసూయలు వేర్వేరుగా ఆకస్మికంగా బుధవారం తనిఖీలు చేశారు.

ఇందులో భాగంగా మండలంలోని కోట, దాలిపాడు ఆశ్రమ పాఠశాలలతో పాటు చవిటిదిబ్బల పంచాయతీ తోటకూరపాలెంలో కేజీబీవీని ఎంపీడీవో బాపన్నదొర సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజనం, స్టోర్‌రూమ్, రికార్డులను తనిఖీ చేశారు. మెనూ సక్రమంగా అమలుచేయాలని వార్డెన్లు, హెచ్ఎంలను ఆదేశించారు. సిక్ విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యర్లగడ్డ, వై.రామవరం ఆశ్రమ పాఠశాలలతో పాటు పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాలలను తహసీల్దార్ అనసూయ సందర్శించారు. వసతి గృహాల్లో సౌకర్యాలను, వండిన భోజనాన్ని, మరుగదొడ్లను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలుపై వార్డెన్లు, హెచ్ఎంలకు సూచనలిచ్చారు.

విద్యాశాఖ నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మరణాలు


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిరిజన సంఘ నేతలు

చింతపల్లి: విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు మృతి చెందారని గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్, ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ అన్నారు. మండలంలో చిటుముల పంచాయతీ నిమ్మలపాలెనికి చెందిన విద్యార్థి ఇటీవల విషాహారం సంఘటనలో మృతి చెందారు. ఆయా బాధిత విద్యార్థి కుటుంబాన్ని వారు బుధవారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ విద్యా శాఖ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఐటీడీఏలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

చింతూరును రెవెన్యూ డివిజన్‌గా కొనసాగించాలి

చింతూరు: రెవెన్యూ డివిజన్‌గా చింతూరునే కొనసాగించాలని ఆదివాసీ జేఏసీ నాయకుడు జల్లి నరేష్ డిమాండ్ చేశారు. చింతూరులో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో మాదిరిగా తిరిగి ఎటపాక రెవెన్యూ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తమకు సమాచారముందని తెలిపారు. ఇతరు మండలాలకు దగ్గరగా ప్రధాన కూడలిగా ఉన్న చింతూరునే రెవెన్యూ డివిజన్‌గా కొనసాగించాలని తద్వారా పరిపాలనకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు గ్రామసభలు


మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో గ్రామసభల నిర్వహణపై ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కేంద్రంలో నిర్వహించే గ్రామసభల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల కల్పనను గుర్తించాలని, ఈ మేరకు అన్ని గ్రామాల నుంచి వేతనదారులు అధిక సంఖ్యల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తప్పనిసరిగా గ్రామసభలకు హాజరుకావాలని, ఇందుకోసం పంచాయతీల వారీగా ప్రత్యేక అధికారులను నియమించనున్నట్టు చెప్పారు. ఏపీవో సంఘంనాయుడు, ఈవోపీఆర్డీ చిన్నాన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

జి.మాడుగుల: మండలంలోని కిల్లంకోట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు, తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు తదితర అంశాలతో పాటు జీవామృతం తయారీ వంటి విషయాలను వివరించారు. మాజీ సర్పంచ్ మత్స్యరాస ప్రసాదరాజు, ఈసీ సభ్యులు సత్యవతి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఎంటీ గణపతి, యూనిట్ ఇన్‌చార్జి రామలింగం, ఐసీఆర్‌పీలు సింహాచలం, రాజుపడాల్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థినికి సాయం


కేజీబీవీలో అనాథ విద్యార్థినికి దుస్తులు అందజేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ జ్యోతి

వై.రామవరం: మండలంలోని తోటకూరపాలెంలో కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న సీహెచ్. పావని అనే అనాథ విద్యార్థినికి పాఠశాల విద్యాలయ కమిటీ చైర్మన్ ఎస్.జ్యోతి బుధవారం దుస్తులు, కాస్మెటిక్స్, చెప్పులు తదితర సామగ్రిని సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విద్యార్థిని రాజమహేంద్రవరం అనాథ ఆశ్రమం నుంచి వచ్చి ఇంటర్‌లో జాయిన్ అయినట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.వి.వి.లక్ష్మి తనకు తెలియజేశారన్నారు. దీంతో స్పందించి విద్యార్థినికి తన వంతు సాయమందించినట్టు తెలిపారు. దాతలు ముందుకొచ్చి అనాథ విద్యార్థినికి సాయమందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు చైర్మన్‌ను అభినందించారు.

వర్గీకరణపై పునరాలోచన చేయాలి


అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


గంగవరంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


తోటపల్లి బ్యాంకు ముందు నినాదాలు చేస్తున్న జేఏసీ కార్యకర్తలు

అరకులోయ రూరల్/గంగవరం/వై.రామవరం/ఎటపాక: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా జిల్లాలోని అరకులోయ, గంగవరం, వై.రామవరం, ఎటపాక తదితర మండలాల్లో దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. ప్రధాన కూడళ్ల వద్ద రాస్తారోకో చేశారు. మధ్యాహ్నం వరకు వ్యాపార దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేయగా, మరికొన్ని ప్రాంతాల్లో మూసివేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు తదితరులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ యోచనపై పునరాలోచన చేయాలన్నారు. నాయకులు రత్నంరాజు, రాజు, కిరణ్, లెనిన్‌రాజు, శ్రీను, రవి, ప్రశాంత్, కృష్ణమోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గంగవరంలో ఎస్ఐ రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి

అరకులోయ రూరల్: రాజ్‌మా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం సుమారు 30 క్వింటాల రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. మండలంలో 14 పంచాయతీల పరిధిలో ఉన్న ఆర్‌బీకేల ద్వారా అన్ని గ్రామాల్లో రైతులకు సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, ఏవో ఫణిరాజ్‌వర్మ, ఎంపీవో జయకళ, ఎఈవో చిన్నయ్యదొర, నాయకులు నర్సింగరావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


చింతపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్


రంపచోడవరం ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు,కార్యకర్తలు


చింతూరులో నిరసన వ్యక్తం చేస్తున్న యూత్ సభ్యులు

చింతపల్లి: కోల్‌కతాలోని వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం రాత్రి చింతపల్లిలో డిగ్రీ కళాశాల నుంచి బస్ స్టాండ్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై దాడులు నిలువరించేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి, అధ్యాపకులు లీలా పావని, నాగేశ్వరరావు, రవీంద్రనాథ్, వెంకట రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: కోల్‌కతాలో వైద్యారాలిపై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రంపచోడవరం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ట వాణిశ్రీ మాట్లాడుతూ కలకత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం సంఘటన యావత్ దేశాన్ని కలిచివేసిందన్నారు. ప్రాణాలను రక్షించే వైద్యుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందన్నార. ఈ మేరకు మహిళల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీటూ కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: కోల్‌కతా ఘటనలో హత్యాచారానికి పాల్పడిని నిందితులు కఠినంగా శిక్షించాలని కోరుతూ చింతూరు యువత ఆధ్వర్యంలో బుధవారం చింతూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా పటిష్టమైన చట్టాలు అమలు చేయాలని కోరారు. యర్రం కాశీ, సతీష్, వెంకన్న, గణేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అధ్వాన దారితో అవస్థలు


బూసిపుట్టు-మున్నిగుడ రహదారి దుస్థితి

డుంబ్రిగుడ: కొల్లాపుట్టు పంచాయతీ బూసిపుట్టు నుంచి మున్నిగుడ, నందివలస, బిత్రగండ, బలియగుడ వరకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిహద్దు ఒడిశా రాష్ట్రంలోని సమీపంలోని గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారి దగ్గర కావడంతో స్థానికులు ఈ మార్గం మీదుగా ఎక్కువగా వెళ్తుంటారని, దారి బాగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరావు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారిని పూర్తి చేయాలని కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు


ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: దోమల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో బుధవారం దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, దీంతో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల రహిత సమాజం ఆరోగ్యానికి సోపానమని, అందువల్ల ప్రజలు దోమల నివారణ కోసం కృషి చేయాలన్నారు. లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ సీతరాం, సచివాలయం కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువులకు టీకాలు


డుంబ్రిగుడలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది


సంతారిలో పశువుకు వైద్యం అందిస్తున్న వెటర్నరీ డాక్టర్ చరణ్, సిబ్బంది


రాజవొమ్మంగిలో పశువును పరిశీలిస్తున్న వెటర్నరీ డాక్టర్ తరుణ్

డుంబ్రిగుడ: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని సొవ్వ, పోతంగి పంచాయతీల్లోని గ్రామాల్లో పశువులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు తదితర వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సుమారు 430 పశువులకు వ్యాక్సినేషన్ చేపట్టామన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది శెట్టి సుబ్బారావు, త్రినాథరావు, సంజీవ్, రమేష్, మనోజ్, అప్పారావు తదతరులు పాల్గొన్నారు.

హుకుంపేట: గ్రామాల్లో పశువులు, మేకలకు జబ్బులు రాకుండా ముందస్తుగా జాగ్రత్త పడాలని, గ్రామాల్లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ చెప్పారు. మండలంలోని సంతారి పంచాయితీలో పశువులకు గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ పరిధిలో 350 పశువులకు టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సర్పంచ్ అప్పలనాయుడు,సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్టు పశువైద్యాధికారి తరుణ్ తెలిపారు. మండల కేంద్రంలో పశువుల ఆస్పత్రి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మార్పుల వల్ల పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. రైతు క్షేత్రాల వద్దకు వచ్చే తమ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు


అవార్డు గ్రహీతలు సత్యనారాయణ, మల్లేశ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: మండల కేంద్రంలో బుధవారం లోకులగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవలందిస్తున్న డీటీ(ఆర్ఎస్)దుమంతి సత్యనారాయణ, వార్డెన్‌గా పనిచేస్తున్న అల్లూరి గిరి యువ సేవా సమితి అధినేత టి.మల్లేష్‌కు లోకులగాంధీ సేవా భూషణ్ అవార్డులను ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, టీడీపీ నేత ప్రసాద్ తదితరులు అందజేశారు. అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవలతో సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. సామాజిక సేవా కార్యకర్తలు, అవార్డు గ్రహీతలు సత్యనారాయణ, మల్లేష్ సేవలు మరువలేనివన్నారు. తోడు ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. లోకుల కిరణ్, ఈశ్వరరావు, రమేష్, మురళీకృష్ణ తదితరుల పాల్గొన్నారు.